

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర


మండలంలోని వెలగలవారి పాలెం గ్రామ సచివాలయానికి జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆకస్మికంగా సందర్శించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పకుండా చేయించుకొని ఫార్మర్ ఐడి పొందాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం వారు ఇస్తున్న పిఎం కిసాన్ సొమ్ము రైతుల ఖాతాలకు జమ చేయబడుతుందని ఆయన స్థానిక రైతులకు తెలిపారు. రైతులందరూ ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం టెక్నికల్ ఎ.బి.ప్రియదర్శిని, రవి, మండల వ్యవసాయ శాఖ ఉద్యోగి సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు పట్టం కట్టేదెవరికో..!

- టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ
- అధికారబలంతో సర్వశక్తులు ఒడ్డుతున్న కూటమి
- 8 నెలల పాలనపై ఉద్యోగులు, నిరుద్యోగుల్లో తీవ్ర చర్చ
- ఉద్యోగులకు ఏం చేశారంటూ అసంతృప్తి జ్వాలలు
- తొలి సంతకం మెగా డిఎస్‌సికి సైతం మోక్షం కరువు
- ప్రతియేటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారనే చర్చ విస్తృతంగా సాగుతోంది. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ పోరు మరింత రసవత్తరంగా మారుతోంది. గతంలో ఏ అధికార పార్టీ చేయని విధంగా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గెలుపు కోసం అధికార బలంతోపాటు సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి ఉంది.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు ప్రచారం

మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలు, స్థానిక కూటమి పార్టీల నేతలంతా అసెంబ్లీ ఎన్నికల తరహాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును ఎన్నికల్లో గెలిపించాలని ఉద్యోగ, కార్మికులతోపాటు ప్రజాసంఘాల నేతలంతా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 27న ఎన్నిక జరగనుంది. దీంతో మరో వారం రోజులే ప్రచార గడువు మిగిలింది. దీంతో ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను ఒకచోట సమావేశపర్చి అధికార పార్టీ ఎంఎల్‌ఏలు ప్రసంగిస్తూ టిడిపి అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నారు. చాలాచోట్ల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది. ఈ ఎన్నికల్లో 3.14 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లంతా ఉద్యోగులు, నిరుద్యోగులే. దీంతో అధికార పార్టీ నేతలలోనూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎందుకంటే గడచిన ఎనిమిది నెల పాలనలో ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఒక్కటంటే ఒక్క ప్రయోజనం కూడా ప్రభుత్వం చేకూర్చని పరిస్థితి ఉంది.

ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఏం చేశారంటూ చర్చ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడిచింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు, నిరుద్యోగులకు కూటమి అనేక హామీలను గుప్పించింది. అధికారంలోకొచ్చాక ఇప్పటి వరకూ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. నిరుద్యోగుల కోసం అంటూ చేసిన తొలి సంతకం మెగా డిఎస్‌సికి ఇప్పటికీ మోక్షం లేకుండాపోయింది. ఎన్నికల్లో నిరుద్యోగులు ఎదురుతిరిగే ప్రమాదం ఉందని తలచి ఎన్నికల కోడ్ ముగియగానే డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతోంది. తొలి సంతకం అమల్లోకి రావడానికి దాదాపు ఏడాది పడుతుందా అంటూ నిరుద్యోగుల్లో చర్చ సాగుతోంది. అంతేకాకుండా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వరకూ నెలకు రూ.మూడువేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినా ఆతీగతీ లేదు. అసలు అమలు చేస్తారో, లేదో తెలియని పరిస్థితి ఉంది. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారని నిరుద్యోగులంతా ఆశగా ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ఉద్యోగులకు ఇప్పటి వరకూ ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. పిఆర్‌సి వేయడంలో ఆలస్యం కావడంతో ఐఆర్ ఇస్తారని ఉద్యోగులు ఎంతగానో ఎదురుచూశారు. అదీ చేయలేదు. దీంతో ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో అధికారపార్టీ నేతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎన్నికల్లో ఓటు టిడిపి అభ్యర్థికి వేస్తారా, లేదా అని కూటమి పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది. ఉద్యోగులను బెదిరించైనా దారికి తెచ్చుకోవాలనే ప్రయత్నాలు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఉద్యోగులు, నిరుద్యోగుల కోసం నిరంతరం పనిచేసే పిడిఎఫ్ వైపు ఉద్యోగులు, నిరుద్యోగులు మొగ్గు చూపుతుండటంతో అధికార పార్టీ నేతలు కలవర పడుతున్నారు. నువ్వా.. నేనా అన్నట్లు సాగుతున్న పట్టభద్రుల ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

ఇళ్ల తొలగింపును అడ్డుకున్న పేదలు

బాధితులకు అండగా నిలిచిన వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు శివారు ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌లో ఇళ్ల తొలగింపును బాధితులు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు మంగళవారం అడ్డుకున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు, పోలీస్ బందోబస్తుతో ఇళ్లను తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, బాధిత పేదలు ఈ ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. తమకు న్యాయం చేయాలని, నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టొద్దని తాము ఎక్కడికి వెళ్లాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌లో 130 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో సుమారు 62 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో 9 పట్టాలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 52 మందికి ఇళ్ల పట్టాలు ఉన్నాయి. దీనిలో 21 మంది లబ్ధిదారులకు ఇంటి రుణం మంజూరవ్వగా పది మంది ఇళ్లను సైతం నిర్మించుకున్నారు. మిగిలిన వారి ఇళ్ల నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ఈ నెల 17న 21 ఇళ్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ నెల 18వ తేదీలోపు ఇంటిని ఖాళీ చేయాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఇళ్ల తొలగింపు ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. దీంతో బాధితులు వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆశ్రయించడంతో సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ బాధితులకు అండగా నిలబడ్డారు. పాలకోడేరు ఎస్‌ఐ రవివర్మ,




ఎస్ఐతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, బాధితులు

పంచాయతీ కార్యదర్శి బంగారు గోపీ, రెవెన్యూ అధికారులతో బాధితులు, సత్యనారాయణ చర్చలు జరిపారు. 21 మందికి పట్టాలు ఇవ్వడం వాస్తవమేనని, అయితే కొంతమందే ఇళ్ల నిర్మించుకున్నారని తెలిపారు. అన్ని ఇళ్లకూ విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపివేయాలని నేతలు ప్రశ్నించారు. ప్రత్యామ్నాయం దొరికేంత వరకు సమయం ఇవ్వాలని, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని బాధితులు కోరారు. ఈ నేపథ్యంలో పది ఇళ్లను అధికారులు తొలగించారు. మిగిలిన 11 మంది ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఖాళీ చేయాలని అధికారులు స్పష్టం చేశారు. అలాగే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. చర్చలు సఫలం కావడంతో అధికారులు అక్కడ నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు మెట్టె రామారావు, ఎర్ర బంగారయ్య, బల్ల నరేష్, జోగి నరసింహమూర్తి, తమ్మినేని వెంకటరమణ, నక్క దుర్గాప్రసాద్, నాగవరపు ఈశ్వరి, తమ్మినేని వెంకటలక్ష్మి, హనుమంతు, చిన్న, మోజాడి అమ్మాజీ, బాజీంకి సతీష్, నాగవరపు సింహాచలం పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

మడ అడవులను పెరగనీయండి
కలెక్టర్ నాగరాణి



తాబేళ్ల గుడ్ల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - నరసాపురం

సముద్ర పర్యావరణ సమతుల్యతను పరిరక్షించేందుకు తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం నరసాపురం మండలం సముద్ర తీర ప్రాంతం చినమైనవానిలంకలో తాబేళ్ల గుడ్లు సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడ్ల సేకరణ-సంరక్షణ-పునరుత్పత్తి కేంద్రాన్ని ఆమె జాయింట్ కలెక్టర్ జిల్లా టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గుడ్ల సంరక్షణకు చేపట్టిన ప్రత్యేక చర్యలపై అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సముద్ర వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా సముద్ర జీవులను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత నెలలో పెద్దఎత్తున తాబేళ్లు మృతి చెంది పెదమైనవానిలంక, చినమైనవానిలంక సముద్ర తీర ప్రాంతానికి కొట్టుకుని రావడం చాలా బాధ కల్గించిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులతో సమావేశమై తాబేళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించడంతోపాటు తాబేళ్లు చనిపోవడానికి గల కారణాలను విశ్లేషించేందుకు పోస్టుమార్టం కూడా చేయించామని, నివేదిక అందాల్సి ఉందని తెలిపారు. అటవీశాఖ పర్యవేక్షణలో తాబేళ్లు వచ్చి గుడ్లు పెట్టే ప్రాంతాలను గుర్తించామన్నారు. ఒక్కో తాబేలు సుమారు 60 నుండి 150 గుడ్లు పెడుతుందని, కుక్కలు, ఇతర జంతువులు, ఆకతాయిల నుండి గుడ్లను సంరక్షించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. అక్టోబర్ నుండి ఏప్రిల్ వరకు తాబేళ్లు గుడ్లు పెట్టే సమయం అని, ఏప్రిల్ అనంతరం గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయన్నారు. రెండు నెలల కాలంలో ఇంకో 25 వేలు గుడ్లు పెట్టే అవకాశం ఉందని, పిల్లలు బయటకు వచ్చిన తర్వాత తిరిగి సముద్రంలో విడిచే కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులను, స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వాములను చేస్తామన్నారు. వచ్చే సంవత్సరంలో ఒక లక్ష గుడ్లు పిల్లలుగా ఎదిగేందుకు రక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సముద్రపు అంచున కట్టిన వలలను అక్టోబర్ నుండి ఏప్రిల్ మధ్య కాలంలో మత్స్యకారులు తొలగించాలని, తద్వారా తాబేళ్ల సముద్రం ఒడ్డుకు వచ్చి గుడ్లు పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. మానవ మనుగడకు సముద్ర వాతావరణం సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

తీరప్రాంతం కోతకు గురికాకుండా విరివిగా మడ అడవులను పెరగనిద్దాం: కలెక్టర్

చినమైనవానిలంక తాబేళ్ల గుడ్లు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్భరేవు,



మడ అడవులను పరిశీలిస్తున్న కలెక్టర్


రాజుల్లంక ప్రాంతాల్లోని మడ అడవులను బోటులో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మడ అడవులను పెరగనీయాలని, వాటిని అక్రమంగా నరికితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సముద్ర తీర ప్రాంతం కోతకు గురికాకుండా రక్షణగా నిలుస్తాయన్నారు. ఇప్పటికే చినమైనవానిలంక, పెదమైనవానిలంక ప్రాంతాల్లో సముద్రం చాలా ముందుకు చొచ్చుకొచ్చిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెద్దమైనవానిలంకలో ఒక కిలోమీటర్ మేర రక్షణ గోడను నిర్మించడానికి రూ.35 కోట్ల నిధులను కేటాయించారన్నారు. ఈ పనులను ఎలైట్ కంపెనీ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. వాస్తవంగా ఏడు కిలోమీటర్ల మేర రక్షణ గోడ నిర్మించాల్సి ఉందని, ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఒక కిలోమీటర్ మాత్రమే రక్షణ గోడను నిర్మిస్తామన్నారు. స్థానిక రైతులతో తాబేళ్ల సంరక్షణ, మడ అడవుల పరిరక్షణపై కలెక్టర్ మాట్లాడి తగు సూచనలు చేశారు. తొలుత చినమైనవానిలంక వెళ్లే మార్గంలో నల్లిక్రీక్ వంతెనను ఆర్అండ్‌బి అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించి వంతెన పటిష్టతకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖాధికారి ఆశ కిరణ్, నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి డాక్టర్ శ్రీ వేద, తహశీల్దార్ రాజరాజేశ్వరి, సర్పంచి ఒడుగు ఏసుబాబు, పంచాయతీ, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, మెరైన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించండి

ప్రజాసంఘాల ప్రచారం ముమ్మరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అండగా ఉంటూ, నిరుద్యోగ యువతీ యువకుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం వీరరాఘవులును గెలిపించాలని కోరారు.




ప్రచారంలో ప్రజాసంఘాల నేతలు

కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరాస్వామి, పతివాడ నాగేంద్ర, శివాజీ, నర్మాల నారాయణరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి: జెసి

ప్రజాశక్తి - మొగల్తూరు

రెవెన్యూ రికార్డుల నవీకరణకు ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కెపి పాలెం గ్రామంలో రీసర్వే పనులను, సరిహద్దుల రికార్డులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రైతుల భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. భూయజమానుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు అభ్యంతరాలు తెలియజేస్తే నమోదు చేసుకోవాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

పాత దస్త్రాల్లో తప్పులుంటే సరిచేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ కె.రాజ్‌కిషోర్, డివిజన్ సర్వే అధికారి కుమార్, మండల సర్వేయర ధనరాజ్, రీసర్వే డిటి నాగేశ్వరరావు, విఆర్‌ఒలు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) 32వ వార్షికోత్సవం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలోని నార్మల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకులు నీరుకొండ లక్ష్మీనారాయణ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. 2024వ సంవత్సరం కార్యకలాపాల నివేదికను కార్యదర్శి తంగేటి శ్రీను ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. ఈ వార్షికోత్సవంను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు మంచం కోళ్లు లాగా తయారుచేసి, లేబర్ కోడ్ల పేరుతో కార్మికులను కట్టు బానిసల్లా మార్చే ప్రయత్నం చేసుందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మిక చట్టాలలో తీసుకువచ్చిన మార్పులు కార్మికవర్గ ప్రయోజనాలను కాలరాసి, పెట్టుబడిదారులకు దాసోహం అన్న



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

పద్ధతిలో ఉన్నాయని ఆయన ఆందోళన చెందారు. గతంలో యజమానులు కార్మిక చట్టాలు అమలు చేయకపోయినా, పిఎఫ్ సకాలంలో కట్టకపోయినా, వేతనాలు సకాలంలో పెంచకపోయినా, వేతనాల్లో కోతలు పెడితే ఉండే శిక్షలు మోడీ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తుందని ఆయన అన్నారు. దేశానికి సంపద పోగుచేసే వాళ్లకు ఎటువంటి ప్రయోజనాలు లేకుండా చేసుందని, పెట్టుబడిదారులకు, అంబానీ, అదానీలకు దేశ సంపద మొత్తం దోచిపెట్టే విధంగా మోడీ ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా, మనుధర్మ రాజ్యాంగానికి అనుకూలంగా పనిచేస్తుందని, ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరణ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని లేనిపక్షంలో ఈ దేశంలో ఉన్న అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలను కలుపుకొని దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నార్మల్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా ఏలూరు వేణు, సెక్రెటరీగా తంగేటి శీను, జాయింట్ సెక్రెటరీగా వార సురేష్, కమిటీ నంబర్‌గా ఎలమంచిలి అప్పారావు ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, ఇతర సంఘాల నాయకులు సత్తి కోదండ రామిరెడ్డి, నరమాల కృష్ణ, కుంచంగి నానాజీ, వడిసెల శ్రీను పాల్గొన్నారు.

బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలి : కలెక్టర్

భీమవరం : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సంబంధిత అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి మంచి ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అమలుపై విద్యుత్ శాఖ అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 13,202 దరఖాస్తులు రిజిస్టర్ కాగా కేవలం 633 గృహాలకు మాత్రమే సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ పథకం అమలు సంతృప్తికరంగా లేదన్నారు. ప్రజలకు సోలార్ ప్యానల్ ఏర్పాటుపై అవగాహన కల్పిస్తే పెద్ద ఎత్తున ప్రజలు ముందుకు వచ్చి సోలార్ విద్యుత్ ఏర్పాటుకు సంసిద్ధంగా ఉంటారన్నారు. బ్యాంకర్లు, విద్యుత్ శాఖ అధికారులు, వెండర్లు లేవనెత్తిన పలు అంశాలపై సందేహాలను నివృత్తి చేస్తూ,



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

అధికారులకు పలు సూచనల చేశారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని సంబంధిత ఎంపిడిఒ, బ్యాంకర్లు కలిసి ఆ గ్రామంలో అవగాహన, రిజిస్ట్రేషన్, బ్యాంకు రుణం కోసం దరఖాస్తు సమర్పణ, సోలార్ ప్యానల్ ఏర్పాటు వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎ.రఘునాథ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ భీమవరం ఎన్.వెంకటేశ్వర్లు, నరసాపురం మధుబాబు, తాడేపల్లిగూడెం నరసింహమూర్తి పాల్గొన్నారు.

వ్యాధులు విజృంభిస్తున్నా ముందస్తు చర్యలు శూన్యం..!

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్రంలో వ్యాధులు విజృంభిస్తున్న అందుకు తగ్గట్టుగా క్షేత్ర స్థాయిలో ముందస్తు చర్యలు శూన్యంమవడంతో ఎప్పుడు ఎటువంటి వ్యాధి స్థానికంగా వ్యాప్తి చెందుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఇన్‌ఫ్లూయోంజా(బర్డ్‌ఫ్లూ), గులియన్‌బారే సింధ్రోం(జిబిఎస్) వ్యాధులు ఆందోళన కలిగిస్తున్నాయి. బర్డ్‌ఫ్లూ ప్రభలడంతో ఆయా ప్రాంతాలలో కోడి మాంసాన్ని నిషేదించారు. అయితే రెస్టారెంట్‌లలో మాత్రం కోడి మాంసంతో చేసిన వంటకాలు అందుబాటులో ఉండటం గమనార్హం. కొంత మంది కోళ్ల వ్యాపారులు రాత్రులు కోళ్లను కోడి మాంసం దుకాణాలకు సరఫరా చేయడంతో వారు వాటిని తెల్లవారు జామునే మాంసంగా మార్చి రెస్టారెంట్‌లకు సరఫరా చేస్తున్నారు. కోడి మాంసంపై నిషేదం ఉన్నా రెస్టారెంట్‌లపై నిఘా లేకపోవడంతో కోడి మాంసం వంటకాలు విక్రయాలు జరిగిపోతున్నాయి. ఇటువంటి తరుణంలో రెస్టారెంట్‌లలో ఆహార పదార్థాల నిల్వ ఎంత మేరకు సక్రమంగా ఉంటుందో జగమెరిగిన సత్యం. ఇదిలా ఉంటే గులియన్‌బారే సింధ్రోం(జిబిఎస్) వ్యాధి ముఖ్యంగా అపరిశుభ్రమైన వంట గది, కలుషిత తాగునీరు, సక్రమంగా నిల్వచేయని పన్నీరు ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఈ వ్యాధి బారిన పడిన వారు వైద్యం పొందుతున్నారు. ఈ వ్యాధి పట్ల రాష్ట్ర ప్రభుత్వ అప్రమత్తమైంది కాని ఇతర ప్రాంతాలలో క్షేత్ర స్థాయి అప్రమత్తత కరువైంది. ఇటువంటి పరిస్థితులలో రెస్టారెంట్‌ల ద్వారా ఎంత మేరకు తాజా ఆహారం వినియోగదారులకు అందజేస్తున్నారో పరిశీలించిన అధికారి లేడంటే అతిశయోక్తి కాదు. ఈ వ్యాధి ఎలా వస్తుందో చెప్పి ప్రజలను ఆ దిశగా చైతన్యం పరిచే ముందస్తు చర్యలు లేవంటే అధికార యంత్రాంగం తీరు ఏ విధంగా ఉందో స్థానికంగా ఉన్న పరిస్థితుల బట్టి తెలుస్తుంది. ఒక వీరవాసరంనే ఉదహరణ తీసుకుంటే జనవాసాల మధ్యే జంతు వధ నిర్వరిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. గ్రామంలో జాతీయ రహదారి వెంబడి మాంసం, చేపలు దుకాణాలు ఉన్నాయి. గ్రామంలో కబేళా ఉన్నా వాటిని వినియోగించకుండా దుకాణాల వద్దే జంతు వధ జరగడం విశేషం. వాటి అవశేషాలను అక్కడే ఉన్న డ్రెయిన్‌లలో వేయడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు విజృంభించడంతో ప్రజలు అంటు రోగాల బారిన పడుతున్నా అవేమి అధికారులకు కానరావడం లేదు. మాంసం దుకాణాల ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులు సైతం డ్రెయిన్‌లు బాగుచేయలేని పరిస్థితి అక్కడ నెలకొని ఉంది. కలుషిత మాంసం వ్యర్థాలను దుకాణాల వద్ద సేకరించి చెరువులలో చేపలకు మేత వేయడం జరుగుతుంది. ఈ వ్యర్థాలతో చేపలకు, వాటి నుంచి మనుషులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నా అటువంటి వాటిపై నియంత్రన లేదు. వీరవాసరంలో మేక, గొర్రె, కోడి మాంసం నాణ్యతను అధికారులు నిర్ధారించకుండానే విక్రయాలు జరిగిపోతున్నాయంటే అధికార యంత్రాంగం పరిస్థితి ఏస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామంలో ఇళ్ల మధ్యే షెడ్లు వేసి మేకలు, గొర్రెలను ఉంచుతున్నారు. దీంతో వాటి ద్వారా దుర్వాసన, దోమల మధ్యే ప్రజలు జీవించవలసిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైన అధికారులు మేల్కొని పాలిథిన్ కవర్‌ను నిషేధించినట్టుగా ప్రజలకు హాని కలిగిస్తున్న పరిస్థితులపై అవగాహన కలిగించి, వ్యాధులు విజృంభించక ముందే వాటికి కారణమవుతున్న పరిస్థితులపై సరైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేప ధరకు రెక్కలు!

భారీగా తగ్గిన కోడిమాంసం అమ్మకాలు

ప్రజాశక్తి - ఆకివీడు

గత వారం రోజులుగా మండలంలో కోడి మాంసం నిషేధించడంతో ఎక్కడికక్కడ అధికారుల తనిఖీల జోరు పెరిగింది. ఈ తనిఖీల ప్రభావంతో కోడి మాంసం అమ్మకాల స్థాయి భారీగా తగ్గింది. దీంతో ఆ స్థానాన్ని ఇతర మాంసాహారాలు ఆక్రమిస్తున్నాయి. అందునా చేపల అమ్మకం ముందు భాగాన నిలిచింది. చేపల విక్రయం స్థానికంగా గతంలో కన్నా రెట్టింపు పెరిగినట్లు చెప్తున్నారు. అందులో రొయ్య వాటా కూడా ఉంది. బాయిలర్ కోడి మాంసం ఒక్కొక్కసారి చేప కన్నా తక్కువ ధరకు దొరికేది. ఈ స్థితిలో బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ దొరకకపోవడంతో చేపల ధర రెట్టింపైంది. మొన్నటి వరకు నెత్తల్లు, పిట్టపరుగులు వంటి చేపలు కిలో అతి తక్కువగా పది రూపాయలు ఉన్నవి నేడు రూ.50కు చేరుకున్నాయి. రొయ్య పరిస్థితి అంతే మొన్నటి వరకు అతి తక్కువ ధరలో ఉండేది. సైజ్‌ను బట్టి కిలో రూ.150 నుంచి 200 మధ్య దొరికేది. ఇప్పుడు రూ.250 దాటిపోయిందని



కొనుగోలుదారులతో రద్దీగా చేపల మార్కెట్

మాంసాహారులు వాపోతున్నారు. రూ.250 పెడితే వచ్చే చికెన్ బిర్యాని నేడు దొరకకపోవడంతో ఇప్పుడు రూ.850 ఖర్చు పెట్టి మటన్ బిర్యాని కొనాల్సి వస్తుందని ఒక బిర్యాని ప్రియుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సగటు మాంసాహారులకి కోడి మాంసం లేకపోవడంతో మాంసం తినే యోగం కోల్పోయాం అంటూ వాపోతున్నారు. ఇదే అదునుగా గొర్రె, మేకల ధరలు కూడా కొద్దికొద్దిగా పెరగడం మొదలైందని చెప్తున్నారు. వచ్చేనెల 10వ తేదీ వరకు ఈ బర్డ్‌ఫ్లూ ప్రభావంతో చికెన్‌పై బ్యాన్ ఉండడంతో ఈ మాంసం ధరలు ఏస్థాయికి పెరుగుతాయోనని మాంసంప్రియులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ రేట్లు ఉభయగోదావరి జిల్లాలకు మాత్రమే పరిమితంగా ఉండటం గమనార్హం. ఆంధ్ర సరిహద్దుల్లో నాలుగు పక్కల ఎక్కడికక్కడ కోడి మాంసం ఎగుమతులు అడ్డుకోవడంతో మంచి కోళ్లు కూడా నష్టపోతున్నామని నాటుకోడి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఉండి : ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో భీమవరం ఎపిఎస్-ఎస్‌డిసి వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్స్(ఆఫీస్ అసిస్టెంట్) త్వరలో ప్రారంభించబడుతుందని, ఈ స్వల్పకాలిక కోర్స్(45 రోజుల)కు దరఖాస్తులు స్వీకరించబడునని ఐటిఐ కళాశాల ప్రధాన అధికారి వేగేశ్న శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఆపైన పాసైన వారు దీనికి అర్హులు అని, ఈ కోర్సు పూర్తిచేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని, ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఈనెల 28వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నాయని, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఐటిఐ కాలేజ్ ప్రధాన అధికారి వేగేశ్న శ్రీనివాస రాజు తెలియజేశారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పది విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి

తణుకు : ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా ఆ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేటట్లు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎఐఎస్ఎ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు గంటా పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం తణుకులో(ఎఐఎస్ఎ) నాయకులు పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులను కలిసి రానున్న రోజుల్లో నిర్వహించే ఫైనల్ ఎగ్జామ్స్‌లో మంచి మార్కులు సాధించాలని వారిని చైతన్యపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేకపోయారని, దానికి కారణాలు అనేకమని అన్నారు. అలా కాకుండా ఈ విద్యా సంవత్సరంలో జరిగే పరీక్షలలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేటట్లుగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులతో పోటీపడేటట్లుగా మార్కులు వచ్చేటట్లు ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యు.మురళీ, కె.అనిల్ పాల్గొన్నారు.

రాజశేఖరంను గెలిపించాలి

భీమవరం టౌన్ : టిడిపి కూటమి ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో విద్యాసంస్థల్లోని పట్టభద్రులైన ఉపాధ్యాయులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి టిడిపి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కూటమి అభ్యర్థి రాజశేఖరంకి తమ ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులంతా కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'జనగణనతో పాటు కులగణన నిర్వహించాలి'

భీమవరం టౌన్ : రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన నిర్వహించి, వెనుకబడిన, అణగారిన కులాల జనాభా ప్రాతిపదికన ఆయా కులాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధులు, రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ జిల్లా సమితి సమావేశం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు అధ్యక్షతన భీమవరం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కోనాల మాట్లాడుతూ ఇళ్ల స్థలాలపై కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని కోరుతూ సిపిఐ చేపట్టిన ఇళ్ల స్థలాల అర్జీలు నింపే కార్యక్రమం జిల్లా వ్యాపితంగా నిర్వహించి, మార్చి 15న జిల్లా కలెక్టర్‌కు ఇళ్ల స్థలాల అర్జీలు అందిస్తామన్నారు. ఇళ్ల స్థలాల సమస్య తీవ్రంగా వుందని, త్వరితంగా పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని కోనాల కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

యువతి ఆత్మహత్య

నరసాపురం : మండలంలోని కొప్పర్రు గ్రామంలో యువతి సోమవారం రాత్రి ఫ్యాన్‌కి ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఇన్‌ఛార్జ్ ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పర్రు గ్రామానికి చెందిన ఎరిచర్ల సిరిని ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉటుందన్నారు. సిరిని అదే గ్రామానికి చెందిన యు.సాలొమోను కొద్దికాలంగా ప్రేమ పేరుతో అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. ఈనెల 17వ తేదీన సిరి ఇంటి వద్దకు వచ్చి సాలొమోను భార్య, చెల్లి దుర్భాషలాడినట్లు, దీనిపై సిరి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈమేరకు ఆమె సోదరుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వెలగలేరులో భారీ చోరీ

ఇరవై మూడున్నర కాసుల బంగారం, రూ.1.80 లక్షల నగదు చోరీ

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు శివారు వెలగలేరు గ్రామంలోని తాడేపల్లిగూడెం రోడ్డులోగల ఓ ఇంట్లో ఆదివారం రాత్రి జరిగిన దొంగతనం వివరాలను మంగళవారం పోలీసులు వెల్లడించారు. ఈ చోరీలో ఇరవై మూడున్నర కాసుల బంగారం వస్తువులు, రూ.1.80 వేల నగదు దొంగల పాలైంది. పెనుమంట్ర ఎస్ఐ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని రోడ్డు పక్కన శివాలయం ఎదురుగా పడాల సూర్యకుమారి ఒక్కరే నివాసం ఉంటున్నారు. ఈమె భర్త విజయ్ కుమార్ బీహార్ రాష్ట్రానికి చెందిన మాజీ మిలటరీ ఉద్యోగి. ఆయన కొంతకాలం క్రితం మృతిచెందారు. సూర్య కుమారి కొన్ని రోజుల క్రితం కుమార్తెను చూసేందుకు విశాఖపట్నం వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పనిమనిషి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గుర్తించి విషయం ఫోన్‌లో సూర్యకుమారికి సమాచారం అందించింది. అనంతరం చోరీ విషయం సూర్య కుమారి స్థానికంగా ఉంటున్న తన అల్లుడు మల్లిడి విజయ్‌కు తెలిపింది. దీంతో విజయ్ పెనుమంట్ర పోలీసులకు చోరీ గురించి సమాచారం అందించారు. సోమవారం సాయంత్రం సూర్యకుమారి హుటాహుటిన వెలగలేరు చేరుకున్నారు. ఈ దొంగతనం ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ చోరీలో బీరువాలో ఉన్న ఇరవై మూడున్నర కాసుల బంగారం, రూ.1.80 వేలు నగదు పోయినట్లు బాధితురాలు సూర్య కుమారి పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.స్వామి పేర్కొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్


తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి తాడేపల్లిగూడెంలోని ఎల్.అగ్రహారంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 7 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం


మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం బీచ్‌లో అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ మంగళవారం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. కొవ్వూరు మండలం బంగారు పేటకు చెందిన వై.సతీష్ ఆన్‌లైన్‌లో జూదం ఆడి డబ్బులు పోగొట్టుకున్నాను అని, ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపించారు. దాని ఆధారంగా ఆ యువకుడు పేరుపాలెం బీచ్‌కు వచ్చాడని పోలీసులతో కలిసి గత మూడు రోజులుగా బీచ్‌లో గాలించారు. చివరకు ఆ వ్యక్తి కడప రైల్వేస్టేషన్లో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో సమస్య పరిష్కారమైందని ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై.. భర్త వేధింపులు

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ ఇంకేటివారి పాలెంకు చెందిన బందెల సుగుణకు గోగులమ్మ పేటకు చెందిన సుందర్ రావుతో 20 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా సుందర రావు మద్యానికి బానిసై హింసిస్తున్నాడని సుగుణ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.వాసు తెలిపారు.



పాలకోడేరులో తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న జర్నలిస్టులు



ఆచంటలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై దాడులు దారుణం

ప్రజాశక్తి విలేకరిపై దాడిని ఖండిస్తూ కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆచంట

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావును ఆ మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాలనాయుడు అకారణంగా దుర్భాషలాడి దాడి చేసి చంపేస్తానని బెదిరించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని, ఆయనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆచంట జర్నలిస్టులు మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

పాలకోడేరు: మక్కువ ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావును బెదిరించిన టిడిపి మండలాధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలకోడేరు మండల విలేకరులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ఉత్తమ ఫలితాల కోసం నిరంతరం కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని స్థానిక టిఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మా పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 168 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. వీరిని ఎ,బి,సి,డి గ్రేడులుగా విభజించి ఎ, బి గ్రేడ్ విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాలు చదివించడం సి, డి గ్రేడ్ విద్యార్థులకు ముఖ్యమైన పాఠ్యాంశాలు చదివిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆదివారం సెలవు రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, వారికి సెలవు రోజుల్లో మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని చదివించడం జరుగుతోందని తెలిపారు. మంచి ఉత్తీర్ణత శాతం సాధించడం కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని, విద్యార్థులు కూడా అంతే శ్రద్ధ పెట్టి చదవడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నామన్నారు. మార్చి 17వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైనటువంటి తర్ఫీదు విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపారు.



ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కాళ్ల : పెదఅమిరం గ్రామ పంచాయతీలో పలు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు సుమారు రూ.65 లక్షలతో జరుగుతున్నాయి. పెదఅమిరంలో మంగళవారం సర్పంచి డొక్కు సోమేశ్వరరావుతోపాటు పంచాయతీ రాజ్ ఎఇ రమేష్ బాబు పలు సిమెంట్ రోడ్లను పరిశీలించారు. చర్చి, వినాయకగుడికి వెళ్లే పెద్ద వీధిలో పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు 20 అడుగులు మేర 120 మీటర్ల పొడవుగా పనులు ప్రారంభించడం జరిగింది. గతంలో ఈ రోడ్డు 10 అడుగుల వెడల్పు ఉండేది. ప్రస్తుతం మరో పది అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా రోడ్లన్నీ గోతులతో దారుణంగా ఉన్నాయన్నారు. ఈ రోడ్డుపైన ప్రజలు రోడ్లు, సౌకర్యాలు సరిగ్గా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లపై నడవాలంటే చాలా ఇబ్బందికరంగా పరిస్థితి ఉందని, వర్షం పడితే వాహనాలు సైతం వెళ్లలేని స్థితిలో ఉంటుందన్నారు. గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు వేయిస్తున్నామన్నారు. గ్రామ ప్రజలకు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ సిమెంట్ రోడ్డు వేస్తున్నామని తెలిపారు. సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేసి, నాణ్యతతో నిర్మించాలని ఆయన సూచించారు. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ప్రోత్సాహంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. అదేవిధంగా గ్రామంలో అబ్బాయి రాజు కాలనీలో నాలుగు సిమెంట్ రోడ్లు, పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. నెహ్రూపేటలో రజకుల ప్రాంతంలో సుమారు ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రెండు లక్షలతో కలిపి రూ.12 లక్షలతో రోడ్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయన్నారు. మెయిన్ రోడ్ నుంచి అబ్బాయి రాజు కాలనీకి వచ్చే రోడ్డులో జిపిఎస్ రోడ్డు పనులు పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఇ రమేష్ బాబు, ఉప సర్పంచి జవ్వాది లీలా కిషోర్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఎఇ



వీల్ ఛైర్స్ అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

రైల్వే స్టేషన్ మేనేజర్ మధుబాబు

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని నరసాపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మధుబాబు అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నరసాపురం రైల్వే స్టేషన్‌కు రూ.10 వేలు విలువ చేసే రెండు వీల్ ఛైర్స్ అందించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ వికలాంగులకు, వృద్ధులకు వీల్ ఛైర్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, బొమ్మిడి సూర్యకుమారి, ఆత్మూరి రమా, సలాది రామారావు, కొట్ల రాము, తోట శ్రీనివాస్, ఆకుల రవికుమార్ పాల్గొన్నారు.



అరటి తోటను తొలగిస్తున్న అధికారులు

మూడెకరాల ఇరిగేషన్ భూమి స్వాధీనం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఒక వ్యక్తి ఆధీనంలో ఉన్న సుమారు రూ.60 కోట్ల విలువచేసే సుమారు 3 ఎకరాల భూమిని ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిలో సాగు చేస్తున్న అరటితోటను మంగళవారం ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తొలగింపు చర్యలు చేపట్టారు. భీమవరం-తాడేపల్లిగూడెం ప్రధాన రహదారికి చేర్చే గొల్లల కోడేరులో 1979లో కమ్మిల సత్యనారాయణ సుమారు ఎకరం 85 సెంట్లు భూమిని మూడేళ్ల పాటు లీజుకు తీసుకోవడం జరిగింది. ఈ లీజు పూర్తయిన తర్వాత మరో ఐదేళ్ల పాటు లీజు పొడగింపు చేసుకున్నారు. 1987లో లీజు పూర్తయిన తర్వాత ఈ భూమిని క్రమబద్ధీకరణ చేయాలని, లీజు పొడగించాలని అధికారులకు దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో కమ్మిలి సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. దీంతో 2016 వరకు ఈ భూమి కోర్టు వివాదంలోనే ఉంది. అయితే లీజుకు తీసుకున్న ఎకరం 85 సెంట్లతో పాటు మరికొంత భూమిని సత్యనారాయణ ఆక్రమించుకోవడం జరిగిందని ఇరిగేషన్ ఎఇ ప్రసాద్ రాజు తెలిపారు. సుమారు మూడు ఎకరాలలో అరటి తోట, కొబ్బరి చెట్లు వేసుకొని ఫల సాయం పొందుతున్నారని అన్నారు. అయితే ఈ భూమి సుమారు రూ.60 కోట్లు విలువ చేస్తుందని ఇరిగేషన్ ఎఇ ప్రసాద్ రాజు అన్నారు. అయితే జిల్లా కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటులో భాగంగా ఈ ఇరిగేషన్ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం సాగుతుంది.

ప్రతిరోజూ డ్రెయినేజీ శుభ్రం చేయాలి

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం : పట్టణంలోని 3వ వార్డులో నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ ప్రతి రోజు డ్రైనేజీ శుభ్రం చేసే పనులను చేపట్టాలన్నారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటురోగాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. డ్రైనేజీలలో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది త్రిమూర్తి, కిషోర్ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీలో పూర్వ విద్యార్థి సురేష్‌బాబు

ప్రజాశక్తి - ఆచంట

పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి అరిగెల సురేష్ బాబు అన్నారు. మండలంలోని పెనుమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అరిగెల సురేష్ పబ్లిక్ పరీక్షల సౌకర్యార్థం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేలులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శ్రమించి, చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేస్తున్న సురేష్ బాబు

ప్రకృతి రక్షణకు గుడ్డ సంచులే మేలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ కవర్లు వద్దు, గుడ్డ సంచులే ముద్దు అని ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ని నివారించాలని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, భీమవరం మున్సిపల్ ఇంజనీర్ త్రినాధ్ అన్నారు. మంగళవారం భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్లో పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నివారించపోతే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు కచ్చితంగా గుడ్డసంచి వెంట తెచ్చుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ప్రకృతి రక్షణకు గుడ్డ సంచులు మేలని, ప్రతిఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటాలని, నాటడమే కాక మొక్కను పరిరక్షించినప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించిన వారమౌతామన్నారు. అనంతరం గన్నాబత్తుల శ్రీనివాస్ సహకారంతో 300 మంది ప్రయాణికులకు ఉచితంగా గుడ్డ సంచులను అందించారు.



ప్రయాణికులకు గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న అధికారులు

'పిల్లల్లో ఆలోచనా శక్తిని పెంపొందించాలి'

జ్ఞానజ్యోతి ప్రారంభంలో ఆకివీడు ఎంఇఒ రవీంద్ర



జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఆకివీడు

చిన్నపిల్లల చదువు పట్ల ఆసక్తి కలిగించడం, వారికి ఆరోగ్యానికి అవసరమైన ఆహారాన్ని అందించడం ప్రతి ఒక్కరి కనీస లక్ష్యంగా ఉండాలని ఎంఇఒ రవీంద్ర సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా తరగతుల కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో మంగళవారం ఎంఇఒ రవీంద్ర ప్రారంభించి మాట్లాడారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. శిక్షణా తరగతుల కాలంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి వి.వాణిరత్నం మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యా శిక్షణ నూతన విద్యా విధానంపై ఎన్నో అంశాలు ఈ శిక్షణలో ముందుగా శిక్షణ పొందిన వారు అందిస్తారని చెప్పారు. రానున్న ఎన్నో రకాల మార్పులపై శిక్షణ ఆరు రోజులు ఉంటుందన్నారు. 18, 19, 20 తారీకుల్లో మొదటి దఫాగా, రెండో దఫా 22, 24, 25 మరో మూడు రోజులు మొత్తం ఆరు రోజులు ఈ సెక్షన్ కొనసాగుతుందన్నారు. మంగళవారం శిక్షణలో ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు నాలుగు మండలాలకు చెందిన 261 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. ప్రతి మండలం నుంచి ప్రాథమిక ఉన్నత స్థాయికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ముందుగా శిక్షణ పొంది అంగన్వాడీలకు శిక్షణ అందిస్తారని ఆమె చెప్పారు. ప్రతిరోజు ఈ శిక్షణ ఉదయం 9 గంటలకు ప్రారంభమై, సాయంకాలం 6 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కుమారి, ఇతర సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : అంగన్వాడీలలో ఉండే మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు, పాఠశాలల్లో చదివే ఆరు నుంచి 14 ఏళ్ల విద్యార్థులలో సమగ్ర వికాశం కోసమే జ్ఞానజ్యోతి శిక్షణ అని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి, పెనుమంట్ర ఆర్ఎ జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మవరపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం పెనుమంట్ర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండలంలోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలకు జ్ఞానజ్యోతి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కోర్స్ డైరెక్టర్‌గా ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు వ్యవహరించిన ఈ శిక్షణలో 18 గ్రామాలలోని సుమారు అన్ని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కోర్స్ గురించి ఉపాధ్యాయ డిఆర్‌పిలు ఎన్.సత్యనారాయణ రాజు, ఇ.శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆర్‌పిలు పి.వరలక్ష్మి, ఎస్.వెంకటలక్ష్మి సమగ్రంగా వివరించారు. ఈ శిక్షణ ఈనెల 20 వరకు, తరువాత 22 నుంచి 25 వరకు ఉంటుందని వారు తెలిపారు.

'సమాజ సేవలో భాగస్వాములు కండి'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థలో సభ్యులుగా చేరి సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రపంచంలో అతి పెద్ద సంస్థ రెడ్ క్రాస్ అని డిఎన్ఆర్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాండు రంగరాజు మాట్లాడుతూ రాయలం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థను ప్రారంభించి, ఉచితంగా సేవలందిస్తున్నారన్నారు. మా కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులను సభ్యత్వాలు చేర్పించి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు, ప్రతి విద్యార్థి రెడ్ క్రాస్ సభ్యునిగా చేరాలని అన్నారు. రెడ్ క్రాస్ సంస్థ మన భీమవరం పట్టణంలో ప్రారంభించడం గొప్ప విశేషమని తెలిపారు. అనంతరం 27 మంది సభ్యత్వం నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బివిఎస్.వర్మ, వెంకటరావు, డాక్టర్ రత్నం, ప్రవీణ్, కె.శిరీష, ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.